క్లుప్తంగా

ఆందోళన వద్దు.. అండగా ఉంటా



పార్టీ కార్యకర్త చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి

నగరి : ఆందోళన వద్దు.. తాను అండగా ఉంటానని పలువురు పార్టీ నేతల కుటుంబాలకు మాజీ మంత్రి ఆర్కేరోజా భరోసా ఇచ్చారు. గురువారం మండలంలోని వేలావడిలో ఇటీవల వైఎస్సార్‌సీపీ నాయకుడు రాజేష్ తల్లి, అలాగే వేలావడి దళితవాడకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మహి మృతి చెందారు. మృతుల కుటుంబ సభ్యులను రోజా పరామర్శించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీ కన్నియప్ప, ఎంపీటీసీలు, సర్పంచులు, కో–ఆప్షన్ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నిండ్ర మండలంలో..



నివాళులర్పించి పరామర్శిస్తున్న రోజా

నిండ్ర: మండల కేంద్రంలోని వైఎస్సార్ సీపీ నాయకులు అయ్యప్ప, దళితవాడలో చార్లీ కుటుంబాలను గురువారం మాజీమంతి ఆర్కే రోజా పరామర్శించారు. అయ్యప్ప తల్లి, చార్లీ అవ్వ ఇటీవలే మరణించడంతో పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో సర్పంచ్ బాబు రెడ్డి, ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ శుభా, రాష్ట్ర పార్టీ యువజన ప్రధాన కార్యదర్శి శ్యామ్ లాల్, జిల్లా పార్టీ ప్రధాన్యదర్శి అనిల్‌కుమార్, మండల కన్వీనర్ వేణురాజు, నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు తోయదాక్షరం, పలువురు నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో విషజ్వరాలు ప్రబలకుండా చూడండి



పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కార్వేటినగరం : గ్రామాల్లో విషజ్వరాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని కత్తెరపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ భువనేశ్వరి తెలిపారు. ఆమె గురువారం ఆళత్తూరు, అల్లాగుంట గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ వైద్య సిబ్బంది క్షేత్ర స్థాయిలో విషజ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించి పారిశుద్ధ్యాన్ని పాటించేలా చూడాలన్నారు. డ్రైడే కార్యక్రమంలో భాగంగా ప్రతి శుక్రవారమూ నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. మురుగు కాలువలు, వర్షపు నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో మెలాథిన్ ద్రావణాన్ని పిచికారీ చేయించాలని సూచించారు. ఇంటింటా సర్వే చేసి డెంగీ, మలేరియా వంటి విషజ్వరాల లక్షణాలు ఉన్న వారిని గుర్తించి వైద్య పరీక్షలు చేయాలన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరానికి స్పందన

నిండ్ర: మండలంలోని ఆరూరులో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఆరూరు పశు ఉప కేంద్రం వైద్యాధికారి ప్రభాకర్ వర్మ పశువులను పరీక్షించి మందులు పంపిణీ చేసి మాట్లాడారు. పాడి పశువుల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పరామర్శ

విజయపురం: మండలంలోని కోసలనగరంలో మృతుల కుటుంబ సభ్యులను ఆర్కే రోజా గురువారం పరామర్శించారు. గ్రామస్తులు మునిబాషా, సుబ్బరామరాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో రోజా మృతుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. పార్టీ మండల కన్వీనర్ శివరాజు, గుణశేఖర్‌రెడ్డి, నార్పరాజు, లీగల్ అడ్వైజర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు వచ్చే మార్గంలో ట్రెంచ్ కొట్టారు



ఇసుక తరలింపు మార్గంలో జేసీబీతో గోతులు తీయిస్తున్న తహసీల్దార్

నగరి : ఇసుక అక్రమ రవాణాపై కన్నెర్ర చేసి సత్రవాడ, వినాయకపురం గ్రామస్తులు ధర్నా, రాస్తారోకో చేయడంతో అధికారులు దృష్టి సారించారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు పూనుకున్నారు. గురువారం తమ సిబ్బందితో కలిసి తహసీల్దార్ రవికుమార్ కుశస్థలి నది నుంచి ఇసుక రవాణాకు అనువుగా ఉన్న సత్రవాడ, కేవీపీఆర్ పేట, ఏకాంబరకుప్పం ప్రాంతాల్లోని మార్గాల్లో జేసీబీతో ట్రెంచ్ కొట్టి, ట్రాక్టర్లు ప్రయాణించలేని విధంగా పెద్ద గోతులు తీశారు. మరో మార్గం ఏదైనా సిద్ధం చేసుకొని ఇసుక తరలించడానికి ప్రయత్నిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సీఎస్‌డీటీ మేఘవర్ణం, వీఆర్వోలు జయశంకర్, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

దుఃఖీభవ..!

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులకు అన్నదాత సుఖీభవ పథకం పేరిట ఏడాదికి రూ.20 వేలు పెట్టుబడి సాయంగా ఇస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చి 9 నెలలవుతున్నా ఇంత వరకు ఆ హామీ నెరవేర్చకపోవడంతో రైతన్నలు పంటల సాగు కోసం అప్పులు చేయకతప్పడం లేదు. ఖరీఫ్ సీజన్ ముగిసి, రబీ సీజన్ నడుస్తున్నా సుఖీభవ ఊసే లేకపోవడంతో దుఃఖీభవ అని తమను కూటమి ప్రభుత్వం నిండా దగా చేసిందని రైతన్నలు మండిపడుతున్నారు.

- పత్తా లేని 'అన్నదాత సుఖీభవ'
- రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో లేని ఎరువులు
- ఖరీఫ్ సీజన్‌లో ఇవ్వని పెట్టుబడి సాయం
- ఇప్పటి వరకూ హామీ నెరవేర్చని సీఎం
- రబీ సీజన్ పెట్టుబడి కోసం తిప్పలు పడుతున్న రైతులు



వరి సాగు

వడమాలపేట (విజయపురం): అధికారం కోసం ఎన్నికలకు ముందు ఆచరణకు సాధ్యం కాని హామీ లు ఇవ్వడం.. తీరా అధికారంలోకి వచ్చాక రైతుల ను వంచించడంతో తానో సిద్ధహస్తుడని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మరోసారి తన చేతల్లో చాటుకున్నారు. సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటికీ అందిస్తామని, బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ అని చేసిన ప్రచారానికి గ్యారెంటీ లేదని తాజాగా నీతి ఆయోగ్ నివేదికపై ప్రజెంటేషన్‌లో సీఎం చంద్రబాబు కుండబద్ధలు కొట్టారు. చంద్రబాబు ఇలా ప్లేటు ఫిరాయించడం ఎంతమాత్రమూ సరి కాదని రైతులు దుమ్మెత్తిపోస్తున్నారు.

అప్పుల సాగు

గత ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు పడడంతో బోరు, బావులు, చెరువులు నిండాయి. అయితే ఖరీఫ్ సీజన్లో కూటమి ప్రభుత్వం రైతులకు రూపాయి కూ డా విదల్చలేదు. దీంతో అప్పులు చేసి విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కోసం వేల రూపాయ లు పెట్టుబడి పెట్టారు. రబీలోనూ పెట్టుబడి కోసం రైతులు అప్పులు చేయాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రబీ సీజన్ ప్రారంభమై రెండు నెలలవుతున్నా ఇప్పటికీ కూటమి ప్రభుత్వం రైతులకు ఎటువంటి సాయం అందించకపోవడంతో నా నా అవస్థలు పడుతున్నారు. ప్రైవేటు బ్యాంక్, వడ్డీ వ్యాపారుల వద్దకు రైతులు పరుగులు తీస్తున్నారు.

గత ప్రభుత్వం క్రమం తప్పక సాయం



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నంత వరకు రైతు భరోసా కింద ప్రతి ఏటా నేను రూ. 13500 తీసుకున్నాను. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నంత వరకు రైతులకు ఎలాంటి కష్టం లేకుండా పోయింది. నిశ్చింతగా ఉండేవాళం. ప్రస్తుతం పెట్టుబడి పెరగడం, రైతు భరోసా లేకపోవడంతో రైతులకు కష్టంగా మారింది.

–కుమార్‌రెడ్డి, రైతు, ఆలపాకం.

మోసపోయాం



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్నదాత సుఖీభవ పథకం పేరిట రూ. 20 వేలు వేస్తానని ఆర్భాటంగా ప్రకటించింది. తీరా అధికారంలోకి 9నెలలైనా ఇంత వరకు ఒక్క రూపాయి కూడా ఇచ్చిన పాపానపోలేదు. గత ప్రభుత్వ పాలనలోనే మేము పథకాల సాయం పొందాం. ఇప్పుడు అప్పు చేయాల్సి వస్తోంది.

నాగరాజు, మాధవరం, రైతు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్‌కు అభినందన



ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపులో పాల్గొన్న రవి కుమార్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, లెక్చరర్లు

కార్వేటినగరం: జాతీయ సమైక్య క్యాంపు 2025లో పాల్గొని ఉత్తమ సేవలు అందించిన ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థిని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయులురెడ్డి అభినందించారు. కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడారు. విద్యార్థుల్లో సేవా దృక్పథాన్ని పెంపొందించేందుకు ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపులు దోహదపడతాయన్నారు. అదే విధంగా కళాశాల నుంచి జాతీయ సమైక్య క్యాంపులో పాల్గొన్న విద్యార్థులకు జాతీయ సమైక్యత, భిన్నత్వంలో ఏకత్వం, మత సామరస్యం అనే అంశాలపై శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పొందే సర్టిఫికెట్ల వల్ల ఉద్యోగ అవకాశాల్లో 30 శాతం రిజర్వేషన్ లభిస్తుందన్నారు. అనంతరం జాతీయ సమైక్యత క్యాంపులో పాల్గొన్న రవికుమార్‌ను శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి ధనుంజయరెడ్డి, అధ్యాపకులు సుబ్బారావు, జోగి ప్రసాద్, కార్తీక్, విద్యాసాగర్ పలువురు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల ధర్నా



ధర్నా చేస్తున్న ఆటో డ్రైవర్లు, ఏఐటీయూసీ నాయకులు

- నగరిలో టెండర్ల పేరిట దండుకుంటున్నారని ఆగ్రహం

నగరి: ఆటో కార్మికుల వద్ద గుత్తహక్కుల పేరిట అధికంగా వసూలు చేయడం రద్దు చేయాలని ఏఐటీయుసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. గురువారం ఆటో వర్కర్స్ యూనియన్ నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడా ఆటో కార్మికుల నుంచి రోజుకు 30 రూపాయలు వసూలు చేయడం లేదన్నారు. కానీ నగరిలో మాత్రం టెండర్లు ఎక్కువ పెట్టామని బలవంతంగా వసూలు చేస్తున్నారన్నారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న రెండు కార్పొరేషన్లు, 5 మున్సిపాలిటీలో కూడా ఇంత అధిక మొత్తంలో ఆటో కార్మికుల నుంచి వసూలు చేయడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు న్యాయబద్ధంగా నామమాత్రపు వసూలు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ నిధులు సమకూర్చుకోవడానికి విచ్చలవిడిగా టెండర్లు ఎక్కువ ధరకు పెట్టి, కార్మికుల వద్ద బలవంతపు వసూళ్లు చేయడం తగదని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఇతర మున్సిపాలిటీలలో ఎలా వసూలు చేస్తున్నారో తెలుసుకుని న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు శేఖర్, ఏసు, నందకుమార్, గోపాల్, లాజర్, ఆర్ముగం, రాజశేఖర్, దయానిధి, ఏఐటీయూసీ సీనియర్ నాయకులు వేలన్, నాయకులు బాషా తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజల కోసం పోరాటాలు

- జీడీ నెల్లూరు సమన్వయకర్త కృపాలక్ష్మి
- వైఎస్సార్‌సీపీ శ్రేణులతో సమావేశం



మాట్లాడుతున్న కృపాలక్ష్మి

వెదురుకుప్పం: కూటమి ప్రభుత్వంలో దగా పడుతున్న పేద ప్రజల కోసం ఏ పోరాటాలకు సిద్ధమని వైఎస్సార్ సీపీ గంగాధరనెల్లూరు సమన్వయకర్త కే.కృపాలక్ష్మి స్పష్టం చేశారు. ఆమె గురువారం పుత్తూరు క్యాంపు కార్యాలయంలో గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల పార్టీ మండల అధ్యక్షులు, నియోజకవర్గ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో ఘోరంగా విఫలమైందన్నారు. వాటిపై ప్రశ్నించే వారి గొంతునొక్కుతూ అరాచకాలకు పాల్పడుతున్నట్టు దుయ్యబట్టారు. అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు పూర్తయినా ఒక్క పథకమూ అమలుచేయలేదని ఆరోపించారు. సంపద సృష్టిస్తామని చెప్పిన సీఎం చంద్రబాబు నిత్యావసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచి పేదల ఉసురు తీస్తున్నారని మండిపడ్డారు. కూటమి రాక్షస పాలన నుంచి విముక్తి కోసం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ ఇప్పటి నుంచి సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలకు భరోసా ఇస్తూ వారికి ఎలాంటి కష్టాలు ఎదురైనా అండగా నిలవాలని సూచించారు. మాజీ సీఎం వైఎస్ జగనన్న ఆదేశాల మేరకు వారంలో శని, ఆదివారాలు మినహా అన్ని రోజులూ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పదవులు అలంకారం కాదని బాధ్యతగా భావించి ప్రజలకు సేవ చేసేందుకు కంకణ బద్ధులు కావాలన్నారు. కేసులు, దాడులకు భయపడే ప్రసక్తే లేదని, కార్యకర్తలకు అండగా ఉంటానని పేర్కొన్నారు. అనంతరం కొత్తగా నియమితులైన పార్టీ మండల అధ్యక్షులను కృపాలక్ష్మి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఐదు మండలాల అధ్యక్షులు కే.పద్మనాభరెడ్డి(వెదురుకుప్పం), కే. విజయకుమార్‌రెడ్డి(పెనుమూరు), ఎస్.తులసీ యాదవ్(పాలసము ద్రం), ఈ. శేఖర్‌రాజు(కార్వేటినగరం), ఎస్. మణి (శ్రీరంగరాజపురం), వెదురుకుప్పం జెడ్పీటీసీ సుకుమార్, బొమ్మయ్యపల్లె ఎంపీటీసీ భాస్కర్, సింగిల్‌విండో మాజీ చైర్మన్ లోకనాథరెడ్డి(వెదురుకుప్పం), జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కుప్పయ్య, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు శివాజీ, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటరత్నం, మాజీ సర్పంచ్ రామచంద్రారెడ్డి, సామాజిక కార్యకర్త దేవరాజరెడ్డి, నాయకులు బొజ్జారెడ్డి, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఫోర్జరీ కేసులో నిందితుడి అరెస్టు



నారాయణరెడ్డి అరెస్టు చూపుతున్న ఎస్‌ఐ

వెదురుకుప్పం : నకిలీ పత్రాల తయారీ కేసులో ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని దిగువపల్లాలు గ్రామానికి చెందిన బి.నారాయణరెడ్డి ఆళ్లమడుగు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 165లో 280 చదరపు గజాల ప్రభుత్వ స్థలానికి(గ్రామ కంఠం) తన పేరిట అనుభవ హక్కు పత్రాన్ని తయారు చేసుకున్నాడు. ఆళ్లమడుగు వీఆర్వో హేమాద్రి రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సంతకాలను ఫోర్జరీ చేశాడు. సీలును సైతం తయారు చేసుకుని అక్రమాలకు పాల్పడ్డాడు. ఈ నకిలీ పత్రాలతో కార్వేటినగరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నారాయణరెడ్డి తన భార్య నాగమ్మ పేరిట రిజిస్ట్రేషన్ చేయించాడు. ఈ నకిలీ వ్యవహారంపై వీఆర్వో హేమాద్రి రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని గురువారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్టు ఎస్‌ఐ తెలిపారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టండి

నిండ్ర: వరి, వేరుశనగ పంటలకు ఆశించే చీడపీడల నిర్మూలనకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి తులసీరాం కోరారు. గురువారం ఆయన మండలంలోని ఇరుగువాయి, జీఎన్ కండ్రిగ గ్రామాల్లో వేరుశనగ, వరి పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. సస్యరక్షణకు తప్పనిసరిగా పిచికారీ చేయాలని సూచించరు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

నిండ్ర: మండల కేంద్రంలోని పాఠశాలను గురువారం ఎంఈఓ శ్రీధర్ తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, రికార్డులతోపాటు విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యా సామర్థ్యాలపై శిక్షణ



మాట్లాడుతున్న సీడీపీఓ సంధ్య

పుత్తూరు: అంగన్‌వాడీ కార్యకర్తలు పూర్వ ప్రాథమిక విద్యా సామర్థ్యాలను పెంపొందించుకోవాలని ఎంఈఓ తిరుమలరాజు కోరారు. గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ అంగన్‌వాడీలు శిక్షణను సద్వినియోగం చేసుకుని లక్ష్యాలకనుగుణంగా ఫలితాలు సాధించాలన్నారు. సీడీపీఓ సంధ్య మాట్లాడుతూ, పిల్లలకు నాణ్యమైన విద్య అందించడంలో అంగన్‌వాడీలు కీలకపాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 బాలసుబ్రమణ్యం, గేట్ పుత్తూరు జెడ్పీ హెచ్‌ఎస్ హెచ్‌ఎం వేములు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు గీతాంజలి, అనిత తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో మంచి అలవాట్లు



విద్యార్థులకు హితబోధన చేస్తున్న సీఐ

నగరి: క్రమశిక్షణ మంచి అలవాట్లను నేర్పుతుందని సీఐ మహేశ్వర్ అన్నారు. గురువారం కాకవేడు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఆయన విద్యార్థులకు క్రమశిక్షణ, మంచి అలవాట్లపై కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని విజ్ఞానం పెంచుకోవడానికి మాత్రమే ఉపయోగించుకోవాలన్నారు. దురలవాట్లకు బానిసలైతే జీవితాలు చేజేతులా నాశనం చేసుకున్నట్లేనని హితోక్తులు పలికారు. సత్ప్రవర్తన కలిగి ఉంటే జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగవచ్చన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు శ్రీదేవి, నమశ్శివాయం, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో కళాశాలకు పేరు ప్రతిష్టలు





పుత్తూరులో ఎన్‌సీసీ క్యాడెట్ల ప్రదర్శన, ఎన్‌సీసీ క్యాడెట్లతోపాటు వారి తల్లిదండ్రులను సత్కరిస్తున్న అధ్యాపకులు

పుత్తూరు: దేశభక్తికి, క్రమశిక్షణకు మారుపేరైన ఎన్‌సీసీ క్యాడెట్ల ప్రతిభతో కళాశాలకు పేరు ప్రతిష్టలు పెరిగాయని స్థానిక ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.చంద్రమౌళి అన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో జనవరి 26న నిర్వహించిన రిపబ్లిక్ డే కవాతులో కళాశాలకు చెందిన బీఎస్సీ విద్యార్థి జి.అవున్ పాల్‌రాజ్, బీబీఏ విద్యార్థి జి.పవన్ ప్రశంసాపత్రాలు అందుకోవడం కళాశాలకు గర్వకారణమన్నారు. గురువారం కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్లు, వారి తల్లిదండ్రులను అధ్యాపక బృందం ఘనంగా సన్మానించింది. ప్రిన్సిపాల్ మాట్లాడు తూ, ఎన్‌సీసీ ప్రపంచంలోనే అతిపెద్ద యూనిఫామ్ కలిగిన సంస్థ అని, అందులో చేరితే దేశభక్తి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సాహస ప్రవృత్తి అల వడుతాయన్నారు. ఎన్‌సీసీ సర్టిఫికెట్ పొందితే ఉన్న త విద్య, ఉద్యోగ అవకాశాలలో రిజర్వేషన్లు వర్తిస్తా యని తెలిపారు. అనంతరం పట్టణంలో ఎన్‌సీపీ క్యాడెట్లు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాళ్లు కోటేశ్వరయ్య, ఎన్‌సీసీ ఆఫీసర్ శ్రీనివాసులు, అధ్యాపకులు వాణిశ్రీ, దేవకి, వెంకటేశన్, హరిబాబు, రఘురామన్, వాసవి, గాయత్రి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్‌పై శిక్షణ



వడమాలపేట బాలికల హైస్కూల్‌లో శిక్షణ ఇస్తున్న దృశ్యం


వడమాలపేట (విజయపురం): వడమాలపేట మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఎర్లీ చైల్డ్ ఎడ్యుకేషన్‌పై అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం గురువారం అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మనీలా, రోజారమణి ఆధ్వర్యంలో ప్రారంభమైంది. ఎంఈఓ పద్మావతి మాట్లాడారు. పుట్టుక నుంచి ఆరేళ్ల వరకు ఉన్న ప్రారంభ బాల్య సంరక్షణ, విద్య (ఈసీసీఈ) చాలా ముఖ్యమైనదన్నారు. ఇది పిల్లలలో మెదడు అభివృద్ధిపై ప్రభావితం చేస్తుందన్నారు. ఎర్లీ చైల్డ్‌కేర్ ఎడ్యుకేషన్ (ఈసీసీఈ) జీవితాంతం మంచి ఆరోగ్యం, పోషకాహారం, అభ్యాస విజయం, సామాజిక–భావోద్వేగ అభివృద్ధి, ఆర్థిక ఉత్పాదకతకు పునాది వేస్తుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



పొగమంచులో లైట్ వేసుకుని వెళుతున్న వాహనదారులు

కమ్మేసిన పొగమంచు

పాలసముద్రం : మండలాన్ని గురువారం పొగమంచు కమ్మేసింది. ఉదయం 8.30 గంటలైనా మంచు వీడలేదు. చలికి ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేదు. రోడ్డుపై వాహనాలు నడిపేవారు లైట్లు వేసుకుని వెళ్లాల్సి వచ్చింది. ఈ మంచుకు మిరప, మామిడి పూత రాలిపోతుందని రైతులు వాపోతున్నారు. వరి, వేరుశనగ పంటలకు చీడపీడలు ఎక్కువగా ఆశిస్తున్నాయని చెబుతున్నారు.



ఉదయం 9 గంటలైనా వీడని మంచు